కాళేశ్వరం ఉప సర్పంచ్ పదవికి ఫుల్ డిమాండ్

# ఆ.. సీటు హాట్ గురూ!

- మూడు నుంచి ఐదు లక్షలైనా వెనుకాడనివైనం
- రాబోయే పుష్కరాల్లలో చూసుకోవచ్చులే అనే ధీమా
- ఉప సర్పంచ్ పదవికి పోటా.. పోటీ
- ఒకప్పటి రాజకియం కాదు అంతా పైసల రాజకియం



**కాళేశ్వరం డిసెంబర్ 13 ( డిడి 9 వార్త ):** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా గ్రామపంచాయతీలలో జరిగే సర్పంచ్ ఎన్నికలలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఇలా పదవి ఏదైనా కూడా దానికి ఫుల్ డిమాండ్ అనేది జగమెరిగిన సత్యమే... కానీ జిల్లాలోని మహాదేవపురం మండలం కాళేశ్వరం గ్రామ ఉప సర్పంచ్ కున్న డిమాండ్ వేరే.. ఈ పదవీ కోసం అభ్యర్థులు నామినేషన్ వేసిన నుండి మొదలు కొని ఎన్నికల రోజు వరకు అహర్నిశలు కష్టపడుతూ, ఎన్నికలలో తాము గెలవడానికి నానా పాట్లు పడుతున్నారనే చెప్పావచ్చు. అంతేకాకుండా భారీ మొత్తంలో ఖర్చుకు కూడా వెనకాడడం లేదు.

ఈ క్రమంలో రిజర్వేషన్లు అనుకూలించిన ప్రాంతంలో అభ్యర్థులు సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నారు. రిజర్వేషన్ అనుకూలించని ప్రాంతంలో వార్డు మెంబర్ గా పోటీ చేసి,విజయం సాధించి ఉపసర్పంచి పదవిని కైవసం చేసుకోవడానికి అశావహులు తీవ్ర ప్రయత్నాలు. కొనసాగిస్తున్నారు. పంచాయతీ నిధులు,బిల్లుల చెల్లింపులో సర్పంచ్, సెక్రటరీతో పాటు ఉపసర్పంచులకు కూడా జాయింట్ చెక్ పవర్ ఉండడంతో ఉపసర్పంచ్ పదవికి నేడు ఫుల్ డిమాండ్ పెరిగినది. దీనికోసం మేజర్ గ్రామపంచాయతీ ఐనా కాళేశ్వరంలో ఉపసర్పంచ్ పదవి కోసం 3 నుండి 5 నుంచి లక్షల వరకు ఖర్చు చేయడానికి ఆశావాహులు వెనకాడడం లేదు అంటే నేడు ఉపసర్పంచి పదవికి ఎంత డిమాండ్ ఉందో ఇట్టే అర్ధమవుతుంది. దీనికోసం ఇప్పటి నుండే వార్డు సభ్యుల్లో ఎవరు గెలుస్తారో ముందే పసికట్టి, వారిని కాకా పట్టి ట్రాక్ లో పెట్టి, ఉప సర్పంచ్ పదవి కోసం తమకు మద్దతు తెలిపితే ఇంత అమౌంట్ ఇస్తానని ముందే ఒప్పందాలు కూడా చేసుకుంటున్నారని సమాచారం. దీనికోసం గెలిచే వార్డు సభ్యుల దగ్గరికి వెళుతూ, వారికి నగదు తో పాటు ఇతర ఆఫర్లు చేస్తున్నారని వినికిడి. ఒకప్పటి రాజకీయాల లో నిజమైన నాయకులతో, ప్రేమ, అభిమానాలు, నమ్మకాల మధ్య ఎన్నికలు జరిగేవి. నేడు దానికి భిన్నంగా ప్రతీది కూడా కమర్షియల్ గా మారి ప్రతి పడవికి గింత రేటు అనే మాదిరిగా తయారయింది. లేదు అలా తయారు చేసినారు నాయకులు, పార్టీలు, ఇటువంటి పరిస్థితులలో రిజర్వేషన్లు అనుకూలించని ఆశావహులు కనీసం ఉప సర్పంచి పదవితోనైనా సరిపెట్టుకోవచ్చనే అశతో తమకు తోచిన మార్గంలో తమ ప్రయత్నాలు చేస్తూన్నారు దీనితో సర్పంచ్ పదవితో పాటు ఉపసర్పంచ్ పదవి కూడా ఖరీదు అయినదని భావిస్తున్నారు. అందరూ ప్రస్తుత రోజులలో రాజకీయం అంటేనే ఖరీదుగా మారిందని, రాజకీయంలో కి వెళ్లాలంటే డబ్బు ఉంటేనే వెళ్లాలనే భ్రమ ను కలిగిస్తున్నారు. ఈ నాయకులు ఈ పార్టీలు చూద్దాం.మరి మరో మూడు రోజులలో వీరి పాచికలు ఎలా పారుతాయో..? వీరు అనుకున్నది సాధిస్తారో...? లేదో..? అన్న విషయం మరో మూడు రోజుల్లో తేలిపోనున్నది.

- బీసీ బిడ్డగా నేనే ప్రవేశపెడుతున్నా
- అన్ని పార్టీలూ మద్దతుగా నిలువాలి
- స్థానికం తొలి విడతలో కాంగ్రెస్‌కు బీసీలు బుద్ధి చెప్పారు
- రెండో, తుది విడతలోనూ తప్పదు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
- మెస్సీపై ఉన్న ప్రేమ బీసీలపై ఎందుకు లేదు : వీ శ్రీనివాస్‌గౌడ్
- త్వరలోనే కేసీఆర్ వస్తరు.. బీసీలకు అండగా ఉంటారు : ఎల్ రమణ
- ప్రజాకోర్టులో సీఎం రేవంత్‌రెడ్డిని శిక్షించాలి : దాసోజు డిమాండ్
- బీసీలపై కాంగ్రెస్ సర్కార్ వివక్ష : మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

# పార్లమెంట్‌లో ప్రైవేటు బీసీ బిల్లు



హైదరాబాద్, డీడీ9 వార్త : 'వెనుకబడిన వర్గాలకు 42% రిజర్వేషన్లను పెంచాలని కోరుతూ ఒక బీసీ బిడ్డగా నేను పార్లమెంట్ లో ప్రైవేటు బీసీ బిల్లు ప్రవేశ పెడతా. ఆ బిల్లుకు అన్ని పార్టీల మద్దతు కోరుతా. వారంతా మద్దతుగా నిలవాలి. 42% బీసీ రిజర్వేషన్ల సాధనకు బీఆర్ ఎస్ కట్టుబడి ఉన్నది' అని బీఆర్ ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర వెల్లడించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్ లో శనివారం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు ఎల్ రమ ణ, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ పై బీసీలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధిచెప్పారని స్పష్టంచేశారు. మలి, తుది విడత ఎన్నికల్లో కూడా గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తేల్చిచెప్పారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలకు కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే బీసీలకు రిజర్వేషన్లు వస్తాయని ప్రకటించిన నాడే బీసీలను ఈ సర్కారు మోసం చేస్తుందన్న సంగతి అర్థమైందని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తున్నామని జీవో విడుదల చేసి, మరో మోసానికి ఒడిగట్టిందని మండిపడ్డారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్ తోనే సాయి ఈశ్వరాచారి ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడినా, అత్యధిక స్థానాల్లో బీఆర్ ఎస్ బలపర్చిన అభ్యర్థులే విజయం సాధించారని తెలిపారు. కాంగ్రెస్ చేసిన మోసాలను బీసీలు గమనిస్తున్నారని, బీసీ జ్వాలలో కాంగ్రెస్ మాడి మసైపోవడం ఖాయమని హెచ్చరించారు.

## మెస్సీపై ఉన్న ప్రేమ బీసీలపై లేదు : వీ శ్రీనివాస్ గౌడ్

సీఎం రేవంత్ రెడ్డికి ఫుట్ బాల్ ఆటగాడు మెస్సీపై ఉన్న ప్రేమ బీసీలపై లేదని మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ కూడా మెస్సీ కోసం కేటాయించిన సమయాన్ని బీసీల కోసం కేటాయించడం లేదని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల కోసం మరణించిన సాయి ఈశ్వరాచారి కుటుంబాన్ని సీఎం రేవంత్ రెడ్డి కనీసం ఓదార్చ లేదని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల కోసం సీఎం.. రాష్ట్రపతి అపాయింట్ మెంట్ అడగడమే లేదని దుయ్యబట్టారు. బీసీల ఓట్లతో కాంగ్రెస్ గద్దినెక్కి, వారికిచ్చిన హామీలు మాత్రం అమ లు చేయడం లేదని దుయ్యబట్టారు. సర్పంచ్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు.

## బీసీలను మోసగించింది కాంగ్రెస్సే: ఎల్ రమణ

అన్నిరంగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మోసం చేసిందని ఎమ్మెల్సీ ఎల్ రమణ మండిపడ్డారు. కేంద్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నా కాంగ్రెస్ బీసీల కోసం ఏమీ చేయలేకపోయిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ లో బీఆర్ ఎస్ ప్రవేశ పెట్టిన బీసీ బిల్లుకు బీజేపీ మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల కోసం ఆత్మహత్యలు చేసుకోవడం పరిష్కారం కాదని హితవు పలికారు. కేసీఆర్ తిరిగి సీఎం అవుతారని, బీసీల అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని భరోసా ఇచ్చారు.

## బీసీలతో రేవంత్ ఫుట్ బాల్ : దాసోజు

సీఎం రేవంత్ రెడ్డి బీసీలతో ఫుట్ బాల్ ఆడుతున్నాడని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ మండిపడ్డారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పార్లమెంట్ లో తమ పార్టీ ఎంపీ ప్రైవేటు బిల్లు ప్రవేశపెడుతున్నందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ తర్వాత జరుగుతున్న పరిణామాలు.. బీసీలను తడిగుడ్డతో గొంతుకోసేలా ఉన్నాయని ధ్వజమెత్తారు. బీసీలను దగా చేసిన రేవంత్ రెడ్డిని ప్రజాకోర్టులో శిక్షించాలని డిమాండ్ చేశారు. అవినీతి కేసులపై పెద్ద లాయర్లను పెట్టుకునే రేవంత్ రెడ్డి.. బీసీల హక్కులు కాపాడేందుకు అదే పెద్ద లాయర్లను ఎందుకు పెట్ట లేదని విమర్శించారు. రెండు, మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు.

## బీసీలపై ఎందుకింత వివక్ష : పొన్నాల

కేంద్రంలో ఎన్నో కొత్తచట్టాలు, కొత్త బిల్లులు వస్తూనే ఉన్నాయని, కానీ, బీసీ రిజర్వేషన్ల బిల్లుల విషయంలో కేంద్ర ఎందుకు వివక్ష చూపుతున్నదని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ప్రశ్నించారు. తమిళ నాడులో బీసీ రిజర్వేషన్ల అమలుకు చట్టబద్ధత వచ్చినప్పుడు తెలంగాణలో బీసీ బిల్లుకు ఎందుకు ఆమోదం రాదు? అని నిలదీశారు. మన రాష్ట్రంలో బీసీలు అధిక సంఖ్యలోనే ఉన్నారు కదా? అని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు కల్పించకుండా కావాలనే తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్ లో బీఆర్ ఎస్ ప్రైవేశపెట్టే బిల్లు కాంగ్రెస్ కు చెంపపెట్టులా ఉంటుందని హెచ్చరించారు.